
తెలుగుప్రభ
మన భాష.. మన పత్రిక
వైబ్రెంట్ ఎడిషన్ 4pm
గురువారం 6-7-2023
teluguprabha.net -TeluguPrabha @TeluguPrabhaofficial

## నవవధువు ఆత్మహత్య



**తెలుగుప్రభ, రంగారెడ్డి (జూలై7):**

రంగారెడ్డిజిల్లా మైలార్ దేవ్ పల్లిలో ఓ నవ వధువు కవిత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అత్త, మామల వరకట్న వేధింపుల కారణంగానే నవవధువు ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం దవాఖానాకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఆమెకు ఏడు నెలల క్రితమే నేతాజీనగర్ నివాసి చంద్రశేఖర్‌తో వివాహమైంది.

**లేటెస్ట్ న్యూస్**

## తెలుగు రాష్ట్రాలకు కొత్త సీజేలు




### కొలీజియం సిఫార్సులతో నియామకాలు

**తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై 6) :**

ఏపీ, తెలంగాణ హైకోర్టులకు కొత్తగా ప్రధాన న్యాయమూర్తుల నియామకానికి కొలీజియం సిఫార్సులు చేసింది. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు మొత్తం 7 రాష్ట్రాల్లో హైకోర్టుల చీఫ్ జస్టిస్ ల బదిలీ జరిగింది. కొలీజియం తాజా సిఫార్సులతో త్వరలోనే కొత్త నియామకాలు జరగబోతున్నాయి. ఏపీ హైకోర్టుకి చీఫ్ జస్టిస్ గా ధీరజ్ సింగ్ ఠాకూర్ ని కొలీజియం సిఫార్సు చేసింది. జమ్మూకాశ్మీర్ కు చెందిన జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ 2013లో అక్కడి హైకోర్టు జడ్జిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన 2022 జూన్ నుంచి బాంబే హైకోర్టు జడ్జిగా ఉన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ను మణిపూర్ హైకోర్టు సీజేగా సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. అది కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్ లో ఉండగా ఆ నియామకాన్ని తాజాగా కొలీజియం రద్దు చేసింది. ఆయన్ను ఏపీ హైకోర్టు సీజేగా సిఫార్సు చేసింది. ఏపీ హైకోర్టు సీజేగా ఉన్న జస్టిస్ పీకే మిశ్రా మే నెలలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అప్పటి నుంచి సీజే స్థానం ఖాళీగా ఉంది. ఇప్పుడు ఏపీ సీజేగా ధీరజ్ సింగ్ ఠాకూర్ వస్తున్నారు.

## తల్లి మరణవార్త విని.. ఆగిన కొడుకు గుండె

### కలచివేసిన విషాద ఘటన




**తెలుగుప్రభ, మన్యం జిల్లా (జూలై 6) :** పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం కొట్టు గుమ్మడ గ్రామం. సమయం సోమవారం ఉదయం ఏడు గంటలు. అప్పటి వరకు ఇంట్లో టీవీ చూస్తూ ఉన్న గుడివాడ స్వయం ప్రభ (68) ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. గమనించిన బందువులు ముఖంపై నీళ్లు చల్లి లేపే ప్రయత్నం చేశారు. అయిన ఆమెలో చలనం లేదు. డాక్టర్ ను పిలిపించి చూపించారు. అప్పటికే ఆమె గుండె పోటుతో మృతి చెందినట్లు డాక్టర్ ధృవీకరించారు. కన్నీరు మున్నీరైన బందువులు ఉపాధి నిమిత్తం హైదరాబాద్ లో అంటోన్న స్వయం ప్రభ ఒక్కగానొక్క కుమారుడు వెంకటేష్ కి ఫోన్ చేసి విషయం చెప్పారు. త్వరగా బయలుదేరి రమ్మన్నారు. అంతే.. ఇలా ఫోన్ కట్ చేసారో లేదో హైదరాబాద్ నుండి కొట్టుగుమ్మడ లోని బంధువులకు తిరిగి ఫోన్ వచ్చింది. తల్లి మరణ వార్త విన్న వెంటనే వెంకటేష్ కుప్ప కూలి పోయి మృతి చెందాడని అతని భార్య పావని ఏడుస్తూ ఫోన్ చేసి చెప్పింది. తల్లిని కడసారి చూసి తలకొరివి పెడతాడనీ వెంకటేష్ రాక కోసం ఎదురు చూస్తున్న బంధువులు, గ్రామస్తులు అతని మరణ వార్త విని షాక్ అయ్యారు. పావుగంట వ్యవధిలోనే తల్లి, కొడుకు మృతి చెందారన్న వార్త అందరినీ కలిచి వేసింది. గ్రామములో తీవ్ర విషాదాన్ని నింపింది.

## పచ్చదనం పెంపునకు పెద్ద పీట

### జీహెచ్ఎంసీ మేయర్

**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై7):** నగరంలో ఆహ్లాదకర వాతావరణం ఏర్పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. పచ్చదనం పెంపునకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని గోల్డెన్‌హైట్స్ కాలనీలో రూ.2.24 కోట్లలో నిర్మించనున్న థీమ్‌పార్కు పను ప్రారంభోత్సవ సందర్భంగా ఆమె పట్టణ ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ... మొఘల్ థీమ్ తో నిర్మించనున్న థీమ్ పార్కునుత్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ప్రజలకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు పచ్చదనం పెంపొందించేందుకు జిహెచ్ఎంసి పెద్దపీట వేస్తుందని తెలిపారు.కార్పొరేషన్ బడ్జెట్ లో 10 శాతం నిధులు పచ్చదనానికి రూ.326.23 కోట్ల గ్రీన్ బడ్జెట్ కేటాయింపు జరుగుతుందని తెలిపారు.48 థీమ్ పార్క్ లు చేపట్టగా 13 వివిధ థీమ్ పార్క్ లు పూర్తయ్యాయని,మిగతావి వివిధ అభివృద్ధి దశలో ఉన్నాయని తెలిపారు.నగరం లో ఉన్న 985 పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఇప్పటి వరకు సుమారు 500 పార్కులను అభివృద్ధి చేశామనితెలిపారు. మొఘల్ థీమ్ పార్కు 17,641 చదరపు గజాలలో ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందులో వాకింగ్ ట్రాక్, 6గెజి బోనిర్మాణాలు, ముఖద్వార నిర్మాణం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత నగరంలో గణనీయమైన మార్పు వచ్చిందని తెలిపారు.ఎస్.ఆర్.డి.పి, సి.ఆర్.ఎం.పి ల ద్వారా రోడ్లు, ఫ్లైఓవర్లు, అండర్ పాస్ లు, లింక్, మిస్సింగ్ రోడ్లు వేయడం జరిగిందని తెలిపారు. ఎస్.ఎన్.డి.పి ద్వారా వరద ముంపు నివారణ కునాలా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురి కాకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని మేయర్ తెలిపారు.





## పోడు గోడు తీర్చుతున్న సర్కారు

### ముమ్మరంగా పట్టాల పంపిణీ

**తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై 6) :**

తెలంగాణలో అటవీ భూములపై హక్కుల కోసం ఎదురుచూస్తున్న గిరిజనులకు పోడు భూముల పట్టాల పంపిణీని తెలంగాణ సర్కారు కొనసాగిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 1,51,146 మంది గిరిజనులకు 4,06,369 ఎకరాలపై హక్కు పట్టాలు అందజేసేందుకు కృతనిశ్చయంతో ఉంది. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో సీఎం కేసీఆర్ ఆరు రోజుల క్రితం ప్రారంభించారు. తాజాగా మంత్రి కేటీఆర్ గురువారం సిరిసిల్లలో పోడు భూముల పట్టాలు పంపిణీ చేశారు.

అటవీ హక్కుల చట్టం-2005 చట్టం కింద రాష్ట్రంలో ఒకేసారి 1.51 లక్షల మంది గిరిజనులకు 4.06 లక్షల ఎకరాలపై హక్కులు పంపిణీ చేయనుంది. ఉమ్మడి రాష్ట్రంలో ఈ చట్టం కింద 96 వేల మందికి 3.08 లక్షల ఎకరాల పంపిణీ జరిగింది. దేశంలో ఛత్తీస్‌గఢ్ మధ్యప్రదేశ్ రాష్ట్రాల తరువాత అత్యధిక అటవీభూములపై పోడుహక్కులు కల్పించిన రాష్ట్రంగా తెలంగాణ నిలవనుంది. జిల్లాల వారీగా పోడుహక్కు పత్రాలకు అర్హులైన గిరిజనుల జాబితాను జిల్లా కలెక్టర్లు సిద్ధం చేశారు.

పోడుపట్టా పాస్‌పుస్తకాల వివరాలతో కూడిన జాబితాలను జిల్లా వ్యవసాయాధికారులకు అందించారు. వ్యవసాయ అధికారులు సంబంధిత పోడుపట్టాల అర్హులకు ఫోన్‌చేసి, బ్యాంకు పాస్‌బుక్ తీసుకుని రైతుబంధు కోసం అనుసంధానిస్తున్నారు. ఈ ప్రక్రియ వారం రోజులుగా కొనసాగుతోంది. గిరిజనులకు పోడు పట్టాలు అందిన రెండు రోజుల్లో అందరికీ రైతుబంధు నిధులు జమయ్యేలా గిరిజన సంక్షేమశాఖ జిల్లా అధికారులతో కలిసి చర్యలు చేపట్టింది. రైతులకు పంపిణీ చేసే పట్టాలకు సంబంధించి హక్కుపత్రాల పాస్‌బుక్‌ల ముద్రణ పూర్తిచేసింది. అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,51,195 ఎకరాలకు, మహబూబాబాద్‌లో 67,730 ఎకరాలకు, ఆసిఫాబాద్ జిల్లాలో 47,138 ఎకరాలకు పోడు పట్టాలు అందనున్నాయి.



## టీ.. కాంగ్రెస్‌లో రచ్చరచ్చ

**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై7):**

కాంగ్రెస్‌పార్టీ బలం పెరుగుతోందని ఆ పార్టీ నేతలు చెబుతున్నప్పటికీ, పార్టీలో అంతర్గత విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికే బీసీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని సీనియర్ నాయకుడు పొన్నాల లక్ష్మయ్య లేవనెత్తిన అంశం చర్చనీయాంశంగా మారింది. మరో వైపు మండల కమిటీల్లో తమ వారికి తీవ్ర అన్యాయం జరుగుతోందని, మండల కమిటీలో చిచ్చు పెట్టడం అన్యాయమంటూ మునుగోడు ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన పాల్వాయి స్రవంతి గాంధీభవన్ చేరుకున్నారు. ఇన్‌చార్జుల లిస్టులో మల్లు రవి జోక్యంపై పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

## మంత్రి మల్లారెడ్డే..



**తెలుగుప్రభ, మేడ్చల్ (జూలై 6) :** ఏంటి తలపై గొంగడి.. చేతిలో కర్ర పట్టుకుని గొర్రెల కాపరిలా ఉన్న ఈయనను ఎక్కడో చూసినట్లు ఉందా? ప్రముఖ వ్యక్తే అనిపిస్తోందా..? అవును.. ఈయన తెలంగాణ మంత్రి మల్లారెడ్డే. తనదైన శైలిలో పంచ్ డైలాగ్‌లు, డ్యాన్స్‌లతో నిత్యం వార్తల్లో నిలిచే మల్లారెడ్డి ఈ సారి గొర్రెల కాపారి అవతారమెత్తారు. ఇవాళ మేడ్చల్ మండలం గౌడావెల్లి గ్రామంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన గొర్రెల పంపిణీ కార్యక్రమనికి విచ్చేసిన ఆయన లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ చేశారు. అనతరం నెత్తిన గొంగడి వేసుకొని కాసేపు గొర్లు కాశారు.



## టమాటాలు దొంగిలించారు..

### మహబూబాబాద్ జిల్లాలో విచిత్ర దొంగతనం

**తెలుగుప్రభ, మహబూబాబాద్ (జూలై 6) :** అవును.. మరి వాటి ఖరీదు అలాంటిది. కొనలేకో.. దొంగతనాలు అలవాటో కానీ.. కొత్తగా టమాటాలను దొంగిలించారు. వాటితో పాటు కొన్ని ఇతర కూరగాయలు కూడా. కూరగాయల ధరల విపరీతంగా పెరిగిన నేపథ్యంలో విచిత్ర సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. కూరగాయల మార్కెట్‌లో దొంగలు కూరగాయలను దొంగిలిస్తున్నారు. ఇటువంటి ఘటనే మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో చోటు చేసుకుంది.గాంధీ సెంటర్‌లోని కూరగాయల మార్కెట్‌లోని ఓ కూరగాయల వ్యాపారి దుకాణం నుంచి టమాట, పచ్చిమిర్చి, చిక్కుడు, బెండ వంటి కూరగాయలు చోరీకి గురయ్యారు. అర్ధరాత్రి వేళ గుర్తు తెలియని దుండగులు ట్రాలీలో వచ్చి కూరగాయలను ఎత్తుకెళ్లారు.

## శరద్ పవార్‌పై కొనసాగుతున్న వార్

### అజిత్ పవార్ మళ్లీ సంచలన వ్యాఖ్యలు

**తెలుగుప్రభ, న్యూఢిల్లీ (జూలై 6) :**

**మహారాష్ట్రలో శరద్ పవార్‌పై వార్ కొనసాగుతూనే ఉంది. స్వయంకృతాపరాథమా, కాలానుగుణంగా వచ్చిన మార్పుల ప్రభావమా కారణాలు తెలీదు కాని ఆయన బలపరిచిన పార్టీ బలహీనపడుతోంది.**

శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీని చీల్చిన అజిత్ పవార్ మరోమారు సంచలన వ్యాఖ్యలు చేశారు. శరద్ పవార్‌ను ఎన్సీపీ జాతీయ అధ్యక్ష పదవి నుంచి ఎప్పుడో తొలగించామని, ఆయన స్థానంలో తనను చీఫ్‌గా ఎన్నుకున్నారని పేర్కొన్నారు. శరద్, అజిత్ పవార్ వర్గాలు నిన్న తమ బలాలు నిరూపించుకునేందుకు పోటాపోటీ సమాశాలు నిర్వహించాయి. జూన్ 30న జరిగిన ఎగ్జిక్యూటివ్ సమావేశంలో శరద్ పవార్ స్థానంలో పార్టీ జాతీయ అధ్యక్షుడిగా అజిత్ పవార్‌ను ఎన్నుకుంటూ తీర్మానం జరిగినట్టు ఎన్నికల సంఘానికి నిన్న సమర్పించిన పిటిషన్‌లో అజిత్ వర్గం పేర్కొంది. జిత్ వ్యాఖ్యలను శరద్ పవార్ ఖండించారు. జూన్ 30న మీటింగ్ జరిగినట్టు అజిత్ పవార్ చెబుతున్నప్పటికీ ఆ సమావేశంలో పీసీ చాకో, సుప్రియా సూలే, జయంత్ పాటిల్, ఫౌజియా ఖాన్ తదితర వర్కింగ్ కమిటీ సభ్యులు లేరని, అసలు ఆ సమావేశం గురించి వారికి తెలియదని పేర్కొన్నారు.

ఈ నెల 3న జయంత్ పాటిల్ నుంచి ఎన్నికల సంఘం ఓ ఈమెయిల్‌ను అందుకుంది. శివసేన-బీజేపీ ప్రభుత్వంలో చేరిన ఆ 9 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని జయంత్ పాటిల్ అందులో కోరారు. మరోవైపు, తనకు సీఎం కావాలని ఉందని బాంద్రాలో జరిగిన తన వర్గం ఎమ్మెల్యేల సమావేశంలో అజిత్ పవార్ పేర్కొన్నారు. తాను రికార్డు స్థాయిలో ఐదుసార్లు ఉప ముఖ్యమంత్రిని అయ్యానని, కానీ బండి అక్కడే ఆగిపోయిందన్నారు. తాను ఈ రాష్ట్రానికి ప్రముఖ్ (సీఎం)ను కావాలని అనుకుంటున్నట్టు మనసులో మాట బయటపెట్టారు.

